క్లుప్తంగా

అభివృద్ధి దిశగా పంచాయతీలు



సర్పంచ్ సాయిలును సన్మానిస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్‌రూరల్: రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు కేసీఆర్ అనేక నిధులు ఇస్తున్నారని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం పోతారం(ఎస్) గ్రామంలో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, సురక్షిత మిషన్ భగీరథ తాగు నీరు సరఫరా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ ఎడబోయిన రజిని తిరుపతిరెడ్డి, సర్పంచ్ బత్తిని సాయిలు, ఎంపీటీసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న బీరప్ప

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆపార్టీ జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. బుధవారం దూళ్మిట్ట మండలంలోని రెడ్యానాయక్ తండాలో పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికేతరుల చేతుల్లో జనగామ అభివృద్ధిలో వెనుకబడిందని.. స్థానిక అభ్యర్థులకే పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో దూళ్మిట్ట మండల బీజేపీ అధ్యక్షుడు ధారావత్ భిక్షపతినాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు తుది జాబితా విడుదల

హుస్నాబాద్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఐటీసీ కార్యాలయంలో ఓటరు తుది జాబితాను విడుదల చేసినట్లు ఆర్డీఓ బెన్ షాలోమ్ తెలిపారు. బుధవారం రెవెన్యూ డి విజన్, తహసీల్దార్ కార్యాలయం నోటీస్ బోర్డుపై జాబితాను అతికించారు. హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదుకు అర్హులని చెప్పారు. ఈనెల 1వ తేదీ వరకు ఓటర్ నమో దు కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి పేరును నమోదు చేసి 304 పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచి నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు హుస్నాబాద్ నియోజకవర్గంలో మహిళలు 1,19,406, పురుషులు 1,17,165, ట్రాన్స్‌జెండర్ 4 మొత్తం 2,36,575 ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు.

'మా సమస్యలు పరిష్కరించండి'



నినాదాలు చేస్తున్న యూనియన్ సభ్యులు

సిద్దిపేట అర్బన్: 8 గంటల పని, పెన్షన్‌తో సహా తమకు అందాల్సిన అన్ని ప్రయోజనాలు అందించాలని ఆల్ ఇండియా గ్రామీణ్ డాక్ సేవక్ యూనియన్ సభ్యులు నినదించారు. బుధవారం మెదక్ డివిజన్‌లోని అన్ని కేంద్రాల్లో యూనియన్‌కు చెందిన సభ్యులు ఒక రోజు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈసందర్భంగా మెదక్ డివిజన్ ప్రెసిడెంట్ అశోక్ మాట్లాడుతూ..సీనియర్ జీడీఎస్ ఉద్యోగుల సర్వీసులకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేసి ఆర్థిక ఉన్నతి కల్పించాలని పేర్కొన్నారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సు చేసిన బంచింగ్ అమలు చేయాలి, టార్గెట్స్- మేళాల రూపంలో ఉద్యోగులపై జరుగుతున్న వేధింపులు ఆపాలని కోరారు. సమ్మెలో మెదక్ డివిజన్ కార్యదర్శి ఆంజనేయులు, మెదక్ డివిజన్ ట్రెజరర్ రఘురాములు, మెదక్ డివిజన్ అసిస్టెంట్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, మాజర్, శ్రీశైలం, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ముదిరాజ్ భవన్ ప్రారంభం



సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామ పరిధిలోని టీహెచ్‌ఆర్ నగర్‌లో నిర్మించిన జిల్లా ముదిరాజ్ భవన్‌ను గురువారం మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్నారు. రూ.7 కోట్లతో ముదిరాజ్ భవన్, ఫంక్షన్‌హాల్‌ను ఏసీ సౌకర్యంతో నిర్మించారు.

జోరుగా కలప అక్రమ రవాణా

- బొగ్గు బట్టీలకు తరలింపు
- పట్టించుకోని అటవీ శాఖ అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): కొందరు అక్రమార్కులు అక్రమంగా చెట్లను నరికి రవాణా చేస్తున్నారు. హరితహారం పేరుతో ప్రభుత్వం ఏటా కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చు చేస్తుంటే అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్కన్నపేట మండలంలోని కట్కూర్, రామవరం, పోతారం(జే), జనగామ, అక్కన్నపేట, గౌరవెల్లితో పాటు పలు గ్రామాల్లో నిత్యం కలప రవాణా జోరుగా సాగుతోంది. వేప, తుమ్మ, చింత చెట్లను దర్జాగా నరికి కలపను వాహనాల్లో పట్టణాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు తూతూ మంత్రంగా కేసులు నమోదు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. బొగ్గు బట్టీల నిర్వహణకు కంపతార, రేగి చెట్లకు అనుమతి తీసుకుంటున్న సదరు వ్యక్తులు విలువైన కర్రను అందులో ఉపయోగిస్తున్నారని సమాచారం.



అక్కన్నపేట: వ్యాన్‌లోకి కలపను లోడ్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

కేసులు నమోదు చేస్తాం

అనుమతి లేకుండా చెట్లను నరికితే కేసులు నమోదు చేస్తాం. అక్రమార్కులపై ప్రత్యేక నిఘా ఉంచాం. కలప అక్రమ రవాణా కాకుండా ప్రజలు సహకరించాలి. రాత్రి వేళల్లో చెట్లను నరుకుతున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వండి.

– సందీప్, ఫారెస్ట్ రెంజ్ అధికారి, హుస్నాబాద్

బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు

గజ్వేల్‌రూరల్/కొండపాక(గజ్వేల్)/మర్కూక్/కోహెడ(హుస్నాబాద్): రైలు ప్రారంభోత్సవ సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం వస్తున్న స్క్రీన్ ధ్వంసం చేయడంతో పాటు ఫ్లెక్సీలను చింపివేయడాన్ని ఖండిస్తూ బుధవారం గజ్వేల్‌లో బీజేపీ నాయకులు మంత్రి హరీశ్‌రావు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నేతల ఆగడాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహేష్, సురేష్, అశోక్‌గౌడ్, వెంకట్‌గౌడ్, ఆనంద్‌సాయిగౌడ్, నవీన్, సతీష్, అనిల్, మధు, రామ్ తదితరులు పాల్గొన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా బీజేపీ మండల అధ్యక్షుడు మన్నెం శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి హరీశ్‌రావు దిష్టిబొమ్మను దహనం చేశారు. రైలు ప్రారంభంలో బీఆర్‌ఎస్ నాయకులు మోదీ ఫొటోలను చింపివేయడంతో పాటు బీజేపీ నాయకులపై దాడి చేయడం హేయమైన చర్య అని మర్కూక్ బీజేపీ మండలాధ్యక్షుడు రమేష్ గుప్త అన్నారు. కోహెడ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ మండల పార్టీ ఆధ్వర్యంలో మంత్రి హరీశ్‌రావు దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు సాగర్‌గౌడ్, పేర్యాల సాగర్‌రావు, సంజీవరెడ్డి, రాములు, సతీశ్, శివకుమార్, సుమన్, రాజు, రాకేశ్ పాల్గొన్నారు.



గజ్వేల్‌లో మంత్రి హరీశ్‌రావు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

పాదయాత్రను విజయవంతం చేయండి

గజ్వేల్: ఈనెల 7న జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నుంచి ప్రారంభించనున్న మాదిగల విశ్వరూప మహా పాదయాత్రను విజయవంతం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) రాష్ట్ర నాయకుడు మైస రాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ, మాదిగ ఉద్యోగుల సమాఖ్య గజ్వేల్ మండల శాఖ అధ్యక్షుడు సల్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం గజ్వేల్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద పాదయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని ఇచ్చిన హామీ తొమ్మిదేళ్లు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదని వాపోయారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పోతగల్ల లింగం, రామస్వామి, బాబు, కర్ణాకర్, కృష్ణ, బూర్గుపల్లి కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

బతుకమ్మ చీరల పంపిణీ

ములుగు(గజ్వేల్)/మర్కూక్/దౌల్తాబాద్(దుబ్బాక)/ మిరుదొడ్డి: ఆడపడుచుల ఆత్మగౌరవాన్ని పెంపొందించే విధంగా ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణీని ప్రారంభించిందని పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, మండల బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తున్కిబొల్లారంలో బుధవారం సాయంత్రం మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, స్వరూపరెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు. మర్కూక్ మండలంలోని ఇప్పలగూడెంలో సర్పంచ్ చాడ ప్రసన్న సుధాకర్‌రెడ్డి మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. దౌల్తాబాద్ మండలంలోని ఇందుప్రియాల్, సూరంపల్లి, లింగరాజుపల్లి తదితర గ్రామాల్లో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు మహిళలకు బతుకమ్మ చీరలను అందజేశారు. దౌల్తాబాద్‌లో ఎంపీపీ గంగాధరి సంధ్య, జెడ్పీటీసీ రణం జ్యోతి అందజేశారు. అలాగే మిరుదొడ్డి మండల పరిధిలోని అందె గ్రామంలో జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ లలిత పాల్గొన్నారు.



తున్కిబొల్లారంలో మహిళలకు చీరల పంపిణీ

కార్యకర్తలకు అండగా ఉంటాం



బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు కనకయ్య నాలుగు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పార్టీ ప్రమాద బీమా కింద మంజూరైన రెండు లక్షల చెక్కును బుధవారం బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ బాలేషంగౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, ఉపసర్పంచ్ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి



సిద్దిపేటలో ఆశావర్కర్ల రాస్తారోకో

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/ హుస్నాబాద్: ఆశావర్కర్లు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాల్‌స్వామి అన్నారు. మంత్రి సత్యవతి రాథోడ్ జిల్లా పర్యటన సందర్భంగా ముందస్తుగా ఆశా కార్యకర్తల అరెస్టును నిరసిస్తూ జిల్లా కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, యూనియన్ నాయకురాలు చెల్లారపు నీరజ, రెడ్డబోయిన బాలమణి, తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్‌లో మంత్రి సత్యవతి రాథోడ్ పర్యటన సందర్భంగా ఆశావర్కర్లు, వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ అయిలేని మల్లికార్జున్‌రెడ్డిని పోలీస్‌లు బుధవారం ముందస్తు అరెస్ట్ చేశారు.

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో బుధవారం ఆశావర్కర్లు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మెలో పాల్గొంటామని హెచ్చరించారు. సమ్మెకు రుద్రారం ఎంపీటీసీ కాముని మంజుల, సీఐటీయూ నాయకుడు బోయిన వెంకట్ మద్దతు తెలిపారు.

దుబ్బాక: ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జిల్లా అధ్యక్షురాలు మంజుల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మె బుధవారం నాటికి 10వ రోజుకు చేరుకోగా పదో సంఖ్య ఆకారంలో కూర్చొని నిరసన తెలిపారు.

కుట్టు శిక్షణతో ఉపాధి



శిక్షణ పొందుతున్న మహిళలతో ఏపీఎం, సర్పంచ్

చిన్నకోడూరు(సిద్దిపేట): ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం మహిపాల్, సర్పంచ్ గాజుల బాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని మాచాపూర్‌లో కొనసాగుతున్న ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని వారు సందర్శించి మాట్లాడారు. శిక్షణ పొందిన వారికి ఉచితంగా కుట్టు మిషన్ అందజేస్తామని తెలిపారు. వారితో పాటు సీసీ శ్రీనివాస్ రెడ్డి, మహిళా సమాఖ్య సభ్యులు ఉన్నారు.

మహిళలకు 'సఖి' భరోసా

సిద్దిపేటకమాన్: మహిళల కోసమే సిద్దిపేటలో భరోసా, సఖి సెంటర్లు ఏర్పాటు చేసినట్లు సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కడవెర్గు మంజుల రాజనర్సు అన్నారు. మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు పట్టణంలోని 35, 36, 38వ వార్డులకు చెందిన మహిళలకు బుధవారం రుతుప్రేమ కార్యక్రమంపై మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, డాక్టర్ శాంతితో కలిసి బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి మహిళ రుతుప్రేమ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని.. తడి, పొడి, హానికర చెత్తను వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని సూచించారు. అనంతరం మహిళలకు ఉచితంగా కప్పులు, క్లాత్ ప్యాడ్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి సరోజన, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాధవి, కౌన్సిలర్లు భూంపల్లి శ్రీలత శ్రీహరి, జయ, ధర్మవరం బ్రహ్మం, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపన ప్రభుత్వ లక్ష్యమని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీపీ ఉపాధ్యక్షుడు కీసరి పాపయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని చెలుకలపల్లిలో ఉపాధి హామీ కూలీలకు స్టీల్ వాటర్ బాటిళ్లు, టిఫిన్ బాక్స్‌లు, బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జీవిత బాబు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



కూలీలకు టిఫిన్ బాక్స్‌లు పంపిణీ చేస్తున్న నాయకులు

అక్రమ అరెస్టులు సరికాదు

హుస్నాబాద్: మంత్రి సత్యవతి రాథోడ్ హుస్నాబాద్ పర్యటన సందర్భంగా బుధవారం బీజేపీ నాయకులను పోలీస్‌లు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు రైల్వేస్టేషన్‌లో అసభ్యకరంగా ప్రవర్తించిన తీరు, బీజేపీ నాయకులపై దాడిని ఖండిస్తూ బీజేపీ నిరసన తెలిపే కార్యక్రమాన్ని నిర్వహించకుండా పోలీస్‌లు అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. అరెస్ట్ చేసిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, నియోజకవర్గ నాయకురాలు కర్ణకంటి మంజులరెడ్డి పరామర్శించారు. అరెస్ట్ అయిన వారిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి, వీరాచారి, నాయకులు మోహన్ నాయక్, నరేష్, సతీష్, సుధాకర్, రవీందర్ తదితరులు ఉన్నారు.



హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు

కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో దస్తావేజు లేఖరులు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం దీక్షలో దస్తావేజు లేఖరులు, రాంపూర్ కురుమ సంఘం నాయకులు, నేతాజీ యూత్ సభ్యులు కూర్చోగా మాజీ ఎమ్మెల్సీ రాజలింగం, మాజీ ఆప్కో చైర్మన్ మండల శ్రీరాములు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సురేష్‌గౌడ్, బీజేపీ నాయకుడు శశిధర్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రెవెన్యూ డివిజన్ ప్రకటించాలని కోరారు.

'ఉద్యోగ భద్రత కల్పించండి'

సిద్దిపేటరూరల్: ఈ పంచాయతీ ప్రాజెక్ట్ మేనేజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు పేస్కేల్, ఉద్యగ భద్రత కల్పించాలని జిల్లా ఈ పంచాయతీ సంఘం అధ్యక్షుడు నవీన్ డిమాడ్ చేశారు. బుధవారం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట శాంతియుత సమ్మె చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పంచాయతీ వ్యవస్థలో చాలా ఏళ్లుగా పనిచేస్తున్న డీపీఎంలకు పేస్కేల్‌ను అమలు చేయాలని, కంప్యూటర్ ఆపరేటర్లుగా విధులు నిర్వర్తిస్తున్న 1619 మందికి ఉద్యోగ భద్రత, జూనియర్ అసిస్టెంట్ హోదా కల్పిస్తూ పే స్కేల్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి నర్సింలు, గౌరవ అధ్యక్షుడు మంద లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక గర్జనకు తరలిరండి

చేర్యాల(సిద్దిపేట): ఈనెల 8న జనగామ జిల్లా కేంద్రంలో జరిగే భవన నిర్మాణ కార్మికుల గర్జనను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు భూమయ్య, యాదగిరి, నర్సింహాచారి, సురేందర్, విజయ, కనకయ్య, సిద్దయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల అరెస్ట్

మిరుదొడ్డి(దుబ్బాక): సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లో తలపెట్టిన ఆందోళన కార్యక్రమానికి బుధవారం తరలివెళుతున్న అంగన్‌వాడీ టీచర్లతో పాటు ఆయాలను మిరుదొడ్డి పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అదుపులో తీసుకున్న వారిలో సీఐటీయూ మండల అధ్యక్షుడు మద్దెల అంజయ్యతో పాటు మండల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఉన్నారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడిచి పెట్టారు.

సమ్మె విరమించిన కార్మికులు

గజ్వేల్‌రూరల్: సమస్యల పరిష్కారం గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు బుధవారం సమ్మెను విరమిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య పేర్కొన్నారు. కార్మికులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు, పెంచిన వేతనాలు చెల్లించేందుకు జీఓ 8 అమలు చేయడంతో సమ్మెను విరమమించినట్లు తెలిపారు. అదే విధంగా కార్మికులకు యూనిఫాంతో పాటు పెండింగ్ బిల్లుల మొత్తం వెంటనే జమ చేయాలని, బ్యాంకు ద్వారా రుణాలను అందించాలని కోరారు. అంతకుముందు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

దుబ్బాక: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు పన్యాల శ్రావణ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం పట్టణంలో బాలాజీ దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలవెంకన్న, సాయికృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకంలో దొర్లిన తప్పు

అక్కన్నపేట(హుస్నాబాద్): మంత్రి సత్యవతి రాథోడ్ బుధవారం మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే కపూర్‌నాయక్ తండా సర్పంచ్ బానోతు సంతోష్‌నాయక్ పేరు శిలాఫలకంలో ప్రశాంత్‌గా ముద్రించారు. ఈవిషయంపై గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, సీఎస్‌కు ఫిర్యాదు చేస్తానని సర్పంచ్ పేర్కొన్నారు. సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు మండల సమావేశం

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు మండ ల సర్వసభ్య సమావేశం గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల కు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలి పారు. అభివృద్ధి పనులు, నెలకొన్న సమస్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు చెప్పారు.

◆ శుభాకాంక్షలు

దౌల్తాబాద్(దుబ్బాక): రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన బక్కి వెంకటయ్యను సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు కొమ్మెర పూజిత వెంకట్‌రెడ్డి బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

◆ అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): గృహలక్ష్మి పథకంలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బెజ్జంకి లో బుధవారం ఆయన మాట్లాడారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఎల్లయ్య, లింగం, తదితరులు పాల్గొన్నారు.

◆ ర్యాలీకి తరలిన ముదిరాజులు

వర్గల్(గజ్వేల్): గజ్వేల్‌లో బుధవారం నిర్వహించిన ముదిరాజుల సింహగర్జన ర్యాలీకి వర్గల్ మండలం నుంచి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శ్రీరామ్ నర్సింలు అధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ముదిరాజ్‌లు తరలివెళ్లారు.

◆ 18 శాతం పీఆర్సీ అందజేయాలి

దౌల్తాబాద్(దుబ్బాక): ఉద్యోగులకు 18 శాతానికి తగ్గకుండా పీఆర్సీని అందజేయాలని పీఆర్టీయూ మండల శాఖ కోరింది. బుధవారం సంఘం నాయకులు రాజిరెడ్డి, త్యాగరాజు మాట్లాడుతూ.. ఎస్జీటీలకు ప్రమోషన్లు ఇవ్వకుండా బదిలీలు చేయడం వల్ల తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

◆ నియామకం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎంఎస్‌పీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా లింగంపల్లి రాకేష్‌ను నియమిస్తూ ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మల్లిగారి యాదగిరి బుధవారం నియామకపత్రం అందించారు.

◆ నియామక పత్రం అందజేత

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీజేపీ నారాయణరావుపేట మండల ప్రధాన కార్యదర్శిగా చొప్పరి బాలును నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి బుధవారం నియామకపత్రం అందించారు.

◆ ప్రభుత్వ భూమి పరిశీలన

బెజ్జంకి(సిద్దిపేట): మండల పరిధి గూడెంలోని 321 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని బుధవారం బెజ్జంకి తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, ఎంపీడీఓ రాములు పరిశీలించారు. పల్లె పకృతి వనం, వ్యాయామ కేంద్రం, కుల సంఘ భవనాల కోసం స్థలాన్ని పరిశీలించి హద్దులు నిర్ణయించారు.

◆ నాయకుల వ్యవహారం సరిగా లేదు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు రైలు ప్రారంభోత్సవం సందర్భంగా వ్యవహరించిన తీరు సరిగా లేదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. బుధవారం పట్టణంలో మాట్లాడుతూ.. సిద్దిపేట పరువు పోయే విధంగా వ్యవహరించారని మండిపడ్డారు. రైల్వే ఆస్తులను ధ్వంసం చేసిన నాయకులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

◆ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ప్రశాంత్ నగర్ (సిద్దిపేట): న్యూస్ క్లిక్ పత్రిక కార్యాలయంపై దాడి చేయడం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ అన్నారు. బుధవారం పట్టణంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

◆ పావలా వడ్డీ రుణాలు కాంగ్రెస్ ఘనతే..

దౌల్తాబాద్(దుబ్బాక): మహిళలకు పావలా వడ్డీకే రుణాలు అందిస్తున్నామని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పడాల రాములు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే మహిళలకు పావలా వడ్డీకే రుణాలు అందించామని తెలిపారు.

◆ ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించాలి

దుబ్బాక: ప్రతీ ఒక్కరు హెల్మెట్ తప్పకుండా ధరించాలని దుబ్బాక బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రొట్టె రాజయౌళి పంతులు, గన్నె భూంరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో ఉచిత లైసెన్స్‌లు పొందిన 693 మంది వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు చేపూరి శేఖర్ గౌడ్, చందురెడ్డి, సుధాకర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

◆ ఉన్నత స్థానంలో నిలిచినప్పుడే గుర్తింపు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలిచినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని గజ్వేల్ ఏసీపీ రమేష్ అన్నారు. మండల పరిధిలోని రిమ్మనగూడ శివారులో గల సురభి దయాకర్‌రావు ఫార్మసీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు బుధవారం ఓరియంటేషన్ నిర్వహించారు. ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.